## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 12 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తంగా ఏడు బెంచ్‌లతో ఈ నెల 14వ తేదీన లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రకటనల పత్రాలను జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్.వీఆర్ఆర్.వరప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ పడదగిన కేసులను రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన బదిలీల ప్రక్రియ

కామారెడ్డి, జూన్ 12 : కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ సబ్ డివిజినల్ పరిధిలోని సివిల్ కానిస్టేబుల్స్, ఏఆర్ కానిస్టేబుల్స్‌ను అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ కింద బదిలీల ప్రక్రియ ముగిసిందని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలకు విశ్వాసాన్ని కలిగించేలా, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, ఆర్ఐలు నవీన్‌కుమార్, కృష్ణ, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడ, జూన్ 12 : పట్టణంలోని వాసవి కాలనీలో గోజే రాఘవేందర్(36) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఇంటి లోపలి నుంచి గడియ వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు. భార్య స్థానికంగా లేదని, బక్రీద్ పండుగ రోజున గుంటూరులో బంధువు మృతి చెందితే వెళ్లింది. పూర్తి వివరాలను దర్యాప్తు తర్వాత వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

**పెద్దమల్లారెడ్డిలో మరో యువకుడు..**

భిక్కనూరు, జూన్ 12 : డబ్బుల విషయంలో భార్య, తల్లి మధ్య గొడవతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన స్వర్ణబాబు(25) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వర్ణబాబు తల్లికి భార్య మమతకు మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఈ విషయమై మనస్థాపం చెందిన బాబు తన రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## స్థానిక వాహనాలకు అనుమతి ఇవ్వాలి

భిక్కనూరు, జూన్ 12 : మండలంలోని అన్ని వాహనాలకు టోల్ ప్లాజా వద్ద అనుమతులు ఇవ్వాలని ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతి నిధులు తీర్మానించారు. భిక్కనూరు మండల వాహనదారులు, టోల్ ప్లాజా యాజమాన్యంతో సీఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. అందరి అంగీకారం మేరకు టోల్‌ప్లాజాలోని చివరి దారిని మండల ప్రజల వాహనాల కోసం మినహాయింపు ఇవ్వడానికి టోల్ ప్లాజా యాజమాన్యం అంగీకరించిందిని తెలిపారు. మండల వాహనదారులు ఆధార్ కార్డు చూపిస్తే సరిపోతుందని తెలిపారు. ఎవరైనా ఈ విషయంలో రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రామారెడ్డి (సదాశివనగర్), జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తల్లిదండ్రులకు సూచించారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ యెల్లారెడ్డిలో ఉన్న దళితవాడ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, మధ్యాహ్న భోజన పథకం, రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని తెలిపారు. దాతల సహకారంతో పాఠశాలలో రంగులు వేయించారన్నారు. సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ప్రముఖశాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, మండల స్పెషల్ అధికారి సతీశ్‌యాదవ్, ఎంఈవో యెసెఫ్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, వయోజన విద్యా ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



పార్కును ప్రారంభిస్తున్న కలెక్టర్

## చిల్డ్రన్ పార్క్ ప్రారంభం

కామారెడ్డి, జూన్ 12 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో ఉన్న 13వ వార్డులో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్‌ను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని పిల్లలందరికీ ఈ పార్కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పిల్లలందరూ ఆడుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ పార్క్‌ను ఎల్లవేళలా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ శంకర్, వార్డు ఆఫీసర్ దీప్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## సినారెకు ఘన నివాళి



కామారెడ్డిలో సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12 : జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో గురువారం సినారె వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సినారే సాహిత్యానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెరవే జిల్లా ఆధ్యక్షుడు గఫూర్ శిక్షక్, ప్రతినిధులు కాశి నర్సయ్య, లింగం, చంద్రకాంత్, రవీందర్, నాగభూషణం, బాలరాజయ్య, విజయరామరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సి. నారాయణరెడ్డి ఏడో వర్ధంతిని గురువారం నిర్వహించారు. సినారె చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, తెలుగుశాఖ అధ్యక్షుడు శంకరయ్య సహాచార్యు లు అమరేశం, ప్రభాకర్‌రావు, చంద్రకాంత్, రాణి, అరుణ్‌కుమార్, సిద్ధురాజు, గంగారెడ్డి, కృష్ణప్రసాద్, గోదావరి, శశికుమార్, సంతోష్‌కుమార్, సూపరింటెండెంట్ వసంతలక్ష్మి, హరికృష్ణ, రవీందర్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

కామారెడ్డి, జూన్ 12 : బాలకార్మిక సమస్యను సమూలంగా నిర్మూలించేందుకు మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి అన్నారు. ప్రపంచ బాలకార్మిక నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బాలకార్మిక నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద కుటుంబాల నుంచి వచ్చే పిల్లలు విద్యను మధ్యలోనే వదిలేసి చిన్నతనంలోనే ఉద్యోగాల్లో చేరుతుండడం దురదృష్టకరమన్నారు. బాల కార్మికులను గుర్తించే విషయంలో గ్రామ, వార్డు వలంటీర్లు సచివాలయ సిబ్బంది బాధ్యతగా ఉండాలని చెప్పారు. 18 ఏండ్లు నిండకముందే పనులు చేయరాదని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కోటేశ్వర్, డీసీపీవో స్రవంతి, చైల్డ్ ఐలైన్ కోఆర్డినేటర్ స్వరూప, సాధన కోఆర్డినేటర్ గిరిజా తదితరులు పాల్గొన్నారు.

**పిల్లలను పనిలోకి పంపొద్దు**

బాన్సువాడ రూరల్, జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాల, బాలికలను పనికి పంపకుండా బడికి పంపాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజారాం దుబ్బలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల, ఆదర్శ, కస్తూర్బాగాంధీ పాఠశాలలు ఏర్పాటు చేసిందని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

## యోగాపై జిమ్‌లో అవగాహన

బాన్సువాడ, జూన్ 12 : పట్టణంలోని జిమ్‌లల్లో యోగాసనాలు సులభసాధన పద్ధతులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువకుల, విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు.

రాబోయే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అందరి సహకారంతో ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలని యోగా ప్రశిక్షకుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లు, పట్టణాభివృద్ధిపై సమీక్ష

బాన్సువాడ, జూన్ 12 : బాన్సువాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు, పట్టణాభివృద్ధిపై రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, పట్టణాభివృద్ధి అంశాలపై రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సమావేశం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జిలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి కాసుల బాల్‌రాజ్ సమీక్షించారు. సమావేశంలో అధికారులకు పోచారం ఫోనులో సూచనలు చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నిర్మాణ పనులపై అవగాహన కల్పించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎజాస్, పోచారం వ్యక్తిగత సహాయకుడు సురేందర్ రెడ్డి, అధికారులు, వార్డు ఇన్‌చార్జిలు ఉన్నారు.

## ఎక్కువ ధరలకు పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

కామారెడ్డి, జూన్ 12 : జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్ట్, షూస్‌ను ఎక్కువ ధరకు విక్రయించొద్దని, అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని డీఈవో రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకాలను ఎంఆర్‌పీకి అనుగుణంగా విక్రయించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకొని అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

## నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

కామారెడ్డి, జూన్ 12 : రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కిసాన్ సంఘ్ ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లపై బోనస్ ఇవ్వాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయించకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనందరావు, కార్యదర్శి కామిరెడ్డి అంజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, కార్యదర్శి శంకర్ రావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఐదు వాహనాల పట్టివేత

నస్రుల్లాబాద్, జూన్ 12 : బీర్కూర్ గ్రామ శివారులో గురువారం ఆర్‌టీఏ అధికారులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలూ లేని ఐదు వాహనాలను స్వాధీన పరుచుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బీర్కూర్ పోలీసులు తెలిపారు.

## అనుమతి లేని వాహనాలపై కేసు నమోదు

కామారెడ్డి, జూన్ 12 : జిల్లా వ్యాప్తంగా అనుమతి లేని వాహనాలపై కేసు నమోదు చేసినట్లు జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, పిట్లంలో నాలుగు స్కూల్ బస్సులపై కేసు నమోదు చేయ గా అందులో రెండు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎలాంటి పత్రాలూలేని 30 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా డ్రైవర్లు, యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్‌లేని బస్సులు రోడెక్కితే జప్తు చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

ఎల్లారెడ్డిరూరల్, జూన్ 12: మేతకు వెళ్లిన గేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఘటన మల్లాయిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని గడ్డం లక్ష్మీకాంతానికి చెందిన గేదె గ్రామ శివారులోని కామ నగేశ్ పొలం సమీపంలో మేత మేస్తుండగా మధ్యాహ్నం కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభం నుంచి వైర్ తెగిపోయింది. మేత మేస్తున్న గేదె వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.25వేల విలువైన తన గేదె విద్యుత్‌షాక్‌తో మృతిచెందిందని, సంబంధిత అధికారులు తనకు నష్టపరిహారం ఇప్పించాలని రైతు లక్ష్మీకాంతం కోరాడు.

## అక్రమంగా చదును చేస్తున్న జేసీబీ పట్టివేత

నాగిరెడ్డిపేట, జూన్12: మండలంలోని ఎర్రకుంట తండా సమీపంలో అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి అక్రమంగా చెట్లను తొలగించి చదును చేస్తున్న జేసీబీని పట్టుకొన్నట్లు ఎఫ్ఆర్వో వాసుదేవ్ తెలిపారు. తండా శివారులో ఉన్న అడవిలో రాత్రివేళ అక్రమంగా ప్రవేశించి జేసీబీతో చెట్లను తొలగించి స్థలాని చదును చేస్తున్నట్లు సమాచారం అందడంతో వెళ్లి జేసీబీని పట్టుకుని గురువారం పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట డీఎఫ్ఆర్వో రవికుమార్, బీట్ ఆఫీసర్ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## విధులను నిర్లక్ష్యం చేసిన విద్యుత్ సిబ్బంది సస్పెన్షన్

నాగిరెడ్డిపేట, జూన్ 12: మండలంలోని తాండూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మన్ మన్సూర్, ఆపరేటర్ రవిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు విద్యుత్‌శాఖ డీఈ విజయసారథి తెలిపారు. వారం రోజుల క్రితం వెంకంపల్లి శివారులో క్యాజ్‌వెల్ లేబర్ యాదగిరి విద్యుత్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడన్నారు. ప్రమాదానికి లైన్‌మన్ మన్సూర్, ఆపరేటర్ రవి నిరక్ష్యం కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరువురిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట, జూన్ 12: మండలంలోని చీనూర్ గ్రామానికి చెందిన బోయిని యాదయ్యపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చీనూర్‌కు చెందిన బోయిని యాదయ్య గ్రామానికి చెందిన సాకి ఇందిరకు చెందిన 10 గుంటల భూమిని కౌలుకు సాగు చేస్తున్నాడు. ఆ భూమిలో వ్యవసాయం చేయవద్దని ఆయన ఇంటికి మంగళవారం వచ్చి బాలయ్య ఆయన కుమారుడు అరుణ్, భార్య లక్ష్మి చెప్పి వెళ్లారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రం గోపాల్‌పేటలో మీసేవా పనులపై వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా చీనూర్ గ్రామానికి వెళ్లే కమాన్ వద్ద అడ్డగించి పై ముగ్గురు దాడి చేసి కొట్టారు. యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మారిన విద్యుత్ అధికారుల సెల్‌ఫోన్ నంబర్లు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారుల పాత సెల్‌ఫోన్ నంబర్లను మార్చి వాటి స్థానంలో కొత్త నంబర్లను కేటాయించినట్లు విద్యుత్ శాఖ డీఈ విజయసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈ నెంబర్ 8712487063, ఏఈ టెక్నికల్ 8712482337, ఎల్లారెడ్డి ఏడీఈ 8712482335, ఏఈ ఎల్లారెడ్డి 8712482330, ఏఈ నాగిరెడ్డిపేట్ 8712482319, ఏడీఈ లింగంపేట్ 8712482308, ఏఈ లింగంపేట్ 8712482292, ఏఈ సదాశివనగర్ 8712482306, ఏఈ గాంధారి 8712482282, ఏఈ సర్వాపూర్ 8712482292, ఏఏవో ఎల్లారెడ్డి 8712482332 నంబర్లను కేటాయించామన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులతో మాట్లాడడానికి ప్రజలు ఈ ఫోన్ నంబర్లు సేవ్ చేసుకొని కాల్ చేయవచ్చని ఆయన సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

లింగంపేట(తాడ్వాయి)/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/బిచ్కుంద/బాన్సువాడ రూరల్/ మాచారెడ్డి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంఈవో రామస్వామి సూచించారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామంలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నామని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగభూషణం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉపాధ్యా యులు నివేదిత, శ్వేత, రమేశ్, సుజాత, శారద, హేమంత్ కుమార్, శ్రీహరి, బాబూబురావు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏక రూపు దుస్తులను హెచ్ఎంలు పంపిణీ చేశారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో షౌకత్ అలీ పాల్గొన్నా రు. ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభ దినం సందర్భంగా విద్యార్థులకు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని తాటిచెట్టుగడ్డ తండా పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులను ఎంఈవో భాస్కర్‌రెడ్డి అందజేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అశోక్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు టై, బెల్టులు అందించినట్లు చెప్పారు. వాటితో పాటు విద్యార్థులకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వర్ష తదితరులు పాల్గొన్నారు.

మాల్తుమ్మెద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐకేపీ డీపీఎం సురేశ్‌కుమార్, ఎంపీడీవో ప్రభాకర్ ఏకరూప దుస్తులు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా దుస్తులను మహిళా సమాఖ్య ద్వారా కుట్టించి అందిస్తున్నదని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఐకేపీ ఏపీఎం జగదీశ్, హెచ్ఎం వెంకటరాజు, సీసీ దత్తు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బిచ్కుంద ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా మండలంలోని గుండెనమ్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూని ఫాంలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని కోనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌ను ప్రధానోపాధ్యాయుడు శేఖర్, మాజీ సర్పంచ్ వెంకటరమణారావు, విద్యాకమిటీ సభ్యులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ విఠవ్వ, ఉపాధ్యాయులు అంజయ్య, నర్సింగ్‌రావు, నర్సింహులు, నబీ, సుజాత, స్నేహలత, అనిత, స్వర్ణలత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.



తాటిచెట్టుగడ్డతండా పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈవో భాస్కర్‌రెడ్డి



కృష్ణాజివాడి గ్రామంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో రామస్వామి

# భూ సమస్య ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి



తిమ్మాపూర్‌లో రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు



గున్కుల్ సొసైటీ వద్ద చైర్మన్ వాజీద్ అలీకి దరఖాస్తు ఫారం అందజేస్తున్న రైతు

లింగంపేట(తాడ్వాయి)/ఎల్లారెడ్డి రూరల్/నిజాంసాగర్/నస్రుల్లాబాద్, జూన్ 12: తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ శ్వేత తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, లక్ష్మాపూర్ గ్రామంలో గిర్దావర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తిమ్మాపూర్‌లో 57, లక్ష్మాపూర్‌లో 41 దరఖాస్తులను తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

మహ్మద్‌నగర్ మండలం గున్కుల్ గ్రామంలో భూ భారతి సదస్సును సొసైటీ చైర్మన్ వాజీద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి పి. కరుణాకర్ రెడ్డి, సొసైటీ సిబ్బంది భాస్కర్, సాయితేజాగౌడ్, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుభాష్, రైతులు పాల్గొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని సంగం గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆమె సందర్శించారు. గ్రామంలో 296/1లో అటవీ రెవెన్యూ భూములు, వివాదాస్పద భూములకు కొన్నేండ్ల క్రితం కొంత మందికి పట్టాలు ఇచ్చారని, మరి కొంత మందికి ఇవ్వలేదన్నారు. పట్టాలు రాని వారికి పట్టాలు ఇప్పించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. తహసీల్దార్ సువర్ణ, ఆర్ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## త్వరలో బస్టాండ్ ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: పట్టణంలో నిర్మిస్తున్న బస్టాండు పనులు దాదాపుగా పూర్తయ్యాయని, నూతన బస్టాండును రవాణాశాఖామంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. గురువారం పట్టణంలోని నూతన బస్టాండులో కొనసాగుతున్న చివరిదశ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా 7 ప్లాట్‌ఫాంలతో బస్టాండ్‌ను అన్ని రకాల హంగులతో నిర్మించామన్నారు. త్వరలోనే రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బస్టాండును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కుడుముల సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల విద్యాసాగర్, గఫార్ తదితరులున్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

లింగంపేట, జూన్ 12: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని లింగంపల్లి, ముస్తాపూర్, ఎల్లారం, ఎల్లమ్మ తండాల్లో ఎంపీడీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఇంటి వద్ద నిర్మించుకొనే ఇంకుడు గుంతలను ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లోనూ ఫాంపాండ్స్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎల్లమ్మ తండా, ఎల్లారం గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో మల్హారీ, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

నేడు కాలభైరవస్వామి ఆలయంలో

## ప్రసాదాల విక్రయానికి వేలం

రామారెడ్డి, జూన్12: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో వెలిసిన కాలభైరవస్వామి ఆలయంలో ప్రసాదాలు, ఫలహారాలు తయారు చేసి విక్రయించడానికి నేడు (శుక్రవారం) ఆలయప్రాంగణ కార్యాలయం నందు బహిరంగా వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 25 వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని ఆలయ ఈవో బూర్ల ప్రభురాంచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షరతులు వేలం ముందు తెలుపుతామని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలలో గత ఏడాదికంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. ఆయన మండలంలోని మీసన్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనతోపాటు గ్రామ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయుడు షాకీర్ తదితరులున్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

లింగంపేట, జూన్ 12: మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పంపిణీ చేశారు. గురువారం మండలంలోని పోతాయిపల్లి, నల్లమడుగుతండా, ముంబాజీపేట, లింగంపేట గ్రామాల్లో పర్యటించి పలువురు బాధితులను పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 12: మండలంలోని మూడు గ్రామాల్లో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు అందజేశారు. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన ఎరుకల బాలమణికి రూ.19వేలు, సోమార్‌పేట్ గ్రామంలో రూ. 48వేలు, శివ్వాపూర్ గ్రామంలో రూ.22వేల విలువైన చెక్కులను వారి ఇండ్లకు వెళ్లి స్థానిక నాయకులు అందజేశారు

## ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

లింగంపేట(తాడ్వాయి), జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని హౌసింగ్ డీఈఈ సుభాష్ సూచించారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## యూరియా వాడకాన్ని తగ్గించాలి

నాగిరెడ్డిపేట, జూన్ 12: రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని ఏరువాక ప్రొఫెసర్లు అనిల్‌రెడ్డి, రేవంత్ సూచించారు. మండలంలోని పోచారం గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమంలో పాల్గొని వారు రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలన్నారు. ఆరు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

## సీజనల్ వ్యాధులపై సమీక్ష

నిజాంసాగర్, జూన్ 12 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిజాంసాగర్, పిట్లం మండలాల ఆరోగ్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై డాక్టర్ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి సమీక్షలో అవగాహన కల్పించారు.

## బిచ్కుంద మున్సిపాలిటీకి నిధులు మంజూరు

బిచ్కుంద, జూన్12 : బిచ్కుంద మండల కేంద్రంతో పాటు గోపన్‌పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలను కలుపుకొని నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లికార్జున్ అప్ప శెట్కార్ అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు.